క్లుప్తంగా

పలహారం బండి ఊరేగింపు

మోతీనగర్: మూసాపేట డివిజన్ అవంతినగర్, ఈస్ట్ కాలనీలో సింక్ మాస్టర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల సందర్భంగా పలహారం బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. కళాకారుల నృత్యాలు, డీజే సాంగ్‌లు నడుమ పలహారం బండి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విశ్వనాథ్, మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ, నాయకులు బొంతు హరికృష్ణ, రాజశేఖర్ రెడ్డి, శ్రీనవాస్, భీమానాయక్, సంజిత్, దీపక్, దుర్గా, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నంబర్ల ఏర్పాటు



మోతీనగర్: ఇంటి నెంబర్లను ఏర్పాటు చేయడంతో సులభంగా చిరునామా లభిస్తుందని మోతీనగర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌పీ ప్రసాద్ అన్నారు. ఎంసీఏ ఆధ్వర్యంలో మోతీనగర్ కో ఆపరేటివ్ సభ్యులకు నూతనంగా ఇంటి నంబర్లను ముద్రించారు.

సన్మాన కార్యక్రమానికి ఆహ్వానం



మోతీనగర్: మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు వచ్చిన సందర్భంగా బీజేపీ స్వచ్ఛ భారత్ అభియాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి, మల్లారెడ్డి గార్డెన్స్‌లో 26న ఉదయం 10 గంటలకు సన్మానం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా కార్యక్రమానికి రావాల్సిందిగా గురువారం అల్లాపూర్ డివిజన్‌లోని ఎమ్మార్పీఎస్ నాయకులకు బీజేపీ నాయకులు ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో బాలస్వామి, విశ్వనాథ్, యాదగిరి, బీజేపీ సీనియర్ నాయకుడు వెంకట రామిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రావణమాస పూజలు

మోతీనగర్: అవంతినగర్ తోట కాలనీలోని ఆలయంలో శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి శుక్రవారం ఉదయం 11 గంటలకు సామూహిక కుంకుమార్చన, 8వ తేది శుక్రవారం వరలక్ష్మి వ్రతం జరుగుతుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మోహన్ (ఫైల్)

మూసాపేట: మూసాపేటలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లుకు చెందిన బానోత్ మోహన్(24) మూసాపేట పరిధి జనతా నగర్‌లో నివాసం ఉంటూ మార్కెటింగ్ పని చేస్తున్నాడు. గురువారం ఉదయం జనతానగర్‌లోని మరో ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెందటంతో బంధువుల ఫిర్యాదు మేరకు కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మోహన్‌కి ప్రేమ వ్యవహారం ఉందని, ఆ కోణంలో మృతి చెంది ఉండవచ్చని పలువురు అనుమానిస్తున్నారు.

వర్షం.. రోడ్లు ఛిద్రం



సాయినగర్‌లో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

- గుంతలమయంగా రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేయాలని వేడుకోలు

ఆల్విన్‌కాలనీ: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని పలు కాలనీ, బస్తీల్లోని రహదారులు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. రహదారుల్లో గుంతలు ఏర్పడి వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. గుంతో? కాదో? తెలియక ద్విచక్ర వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో శిధిలావస్థకు చేరిన రహదారుల్లో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు రాకపోకలు సాగించలేక నానా ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలలో గుంతలు ఏర్పడ్డ రహదారులను వేసవి కాలంలో ప్యాచ్ వర్కు పూర్తి చేయకపోవటంతో వర్షాకాలంలో ఇటువంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని వాహనదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో, బస్తీల్లో రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యను పరిష్కరించమని కాళ్ల చెప్పులరిగేలా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దగ్గరకు తిరిగినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రభుత్వాధికారులు ఎమర్జెన్సీ మాన్‌సూన్ టీం ద్వారా రోడ్లపై ఉన్న గుంతలకు ప్యాచ్ వర్కు పనులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆల్విన్‌కాలనీ ఎస్ఎస్‌డీ స్కూల్ సమీపంలో బ్రిడ్జిపై..



తులసినగర్‌లో వర్షపు నీటితో..



కూకట్‌పల్లి పాపిరెడ్డినగర్‌లో శిథిలమైన రహదారి



ఆల్విన్‌కాలనీలో ప్యాచ్‌వర్కు చేయకపోవడంతో..

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



కేపీహెచ్‌బీకాలనీ: తప్పిపోయిన ఓ విద్యార్థినిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. కేపీహెచ్‌బీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ వివరాల ప్రకారం.. హెచ్‌ఎంటీ హిల్స్, రామాలయం సమీపంలోని బ్రిలియంట్ గ్రామర్ హైస్కూల్‌లో చదువుతున్న ఎస్. సమన్విత (12) పాఠశాల ఆవరణ నుంచి బయటకు వెళ్లింది. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సమీపంలోని సీసీ టీవీ ఫుటేజిని పరిశీలించి పాఠశాల సమీపంలోని కిరాణ జనరల్ స్టోర్ వద్ద ఆమెను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు.

నేటి నుంచి కార్గిల్ విజయ్ దివస్

మూసాపేట: కేపీహెచ్‌బీ కాలనీలోని లులు మాల్‌లో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను నిర్వహించనున్నట్లు మాల్ రీజినల్ డైరెక్టర్ అబ్దుల్ ఖాదీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు ఆర్మీ ఆయుధాల ప్రదర్శన, కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న నాటి జవాన్లను సన్మానించనున్నట్లు ఆయన తెలిపారు. సందర్శకులు, విద్యార్థులు ఈ ప్రదర్శనను ఉచితంగా తిలకించవచ్చని పేర్కొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీల పూడికతీత



ఎస్సీ బస్తీలో డ్రైనేజీ పూడికతీతను పరిశీలిస్తున్న వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ

ఓల్డ్ బోయిన్‌పల్లి: మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయని, వాటిని క్లీన్ చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ దృష్టికి స్థానికులు తీసుకురావడంతో ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ స్పందించి సిబ్బందితో సమావేశం ఏర్పాటు డ్రైనేజీలలో పూడిక తీయించారు. హస్మత్‌పేట, ఎస్సీ బస్తీలలో పొంగి పొర్లుతున్న డ్రైనేజీలను క్లీన్ చేశారు. మిగతా ప్రాంతాల్లో రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

రోడ్లపై గుంతలను పూడ్చాలి



అధికారులతో కలిసి గుంతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ప్రభాకర్ రెడ్డి గర్ నుంచి దీన్‌దయాల్ నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారి వెంట మంచినీటి పెద్ద లైన్ వేయటం, దాన్ని సకాలంలో పూడ్చకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. దీంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా తయారైందని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. గురువారం ఆయన ట్రాన్స్‌మిషన్ మేనేజర్ వివేక్‌ని పిలిపించి సమస్యను పరిశీలించారు. వెట్ మిక్స్ ఎక్కువ శాతం వేసి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. వెంటనే వెట్ మిక్స్‌ను వేసి సమస్యను పరిష్కరిస్తానని అధికారి తెలిపారు. కార్యక్రమంలో బాకీ, రామ్‌రెడ్డి, గోపాల్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, కన్నయ్య, రాజ్‌కుమార్, విష్ణు పాల్గొన్నారు.

ఆలయంలో హోమం.. అన్నదానం



ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ అలయంలో గురువారం హోమం, అన్నదానం నిర్వహించారు. భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కనకదుర్గ ఆలయంలో ప్రతి అమావాస్యకు అన్నదానం చేసేందుకు తగిన సహాయ సహకారాలు అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రిటైల్ కూరగాయల మార్కెట్ చైర్మన్ సత్యనారాయణ, మార్కెట్ అధ్యక్షుడు మక్కాల అశోక్, వైస్ చైర్మన్ రమేష్, ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల నర్సింగ్, కార్యదర్శి మక్కాల నర్సింగ్‌రావు, నాయకులు బాల్‌రాజు, నాగేష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వారాంతపు సంత తొలగించాలని వినతి



మోతీనగర్: మోతీనగర్ ప్రధాన వీధుల్లో ప్రతి శుక్రవారం జరిగే సంతను తొలగించాలని మోతీనగర్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం జీహెచ్‌ఎంసీ మూసాపేట డిప్యూటి కమిషనర్ ఇస్లావత్, సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ కార్తీక్‌లను సొసైటీ ప్రధాన కార్యదర్శి బొడ్డు సీతారామయ్య ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంత నిర్వహించడం వల్ల సమీప నివాసితులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంత వల్ల చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తుందన్నారు. అంతేకాకుండా ప్రధాన రోడ్డులో ఉన్న నివాసితుల ఇళ్లలోకి వెళ్లడానికి వీలు లేకుండా గేట్లకు అడ్డంగా సంత నిర్వహిస్తున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి ప్రతి శుక్రవారం నిర్వహించే వారాంతపు సంతను శాశ్వతంగా తొలగించాలని కోరారు. మార్కెట్ తొలగింపు, అంతర్గత రోడ్ల శుభ్రం చేయటం, క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయటం, వీధి కుక్కల బెడద సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపినట్లు వారు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి



సూర్యదేవర నరేంద్ర (ఫైల్)

మూసాపేట: రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకున్న వ్యక్తి ఉదయం చూసే సరికి మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా, మున్నలూరు గ్రామానికి చెందిన సూర్యదేవర నరేంద్ర (47) భార్యా, పిల్లలతో కలిసి హెచ్ఎంటీ శాతవాహన నగర్‌లో నివాసం ఉంటున్నాడు. బుధవారం రాత్రి 8.30 గంటలకు తన కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసిన తరువాత రూంలోకి వెళ్లి పడుకున్నాడు. తెల్లవారి భార్య తలుపు కొట్టగా తీయకపోవటంతో ఆందోళనకు గురైన ఆమె ఇంటి పక్కన వారి సాయంతో తలుపులు కొట్టి చూడగా నరేంద్ర డోర్ వెనకాలే పడిపోయి ఉన్నాడు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాతావరణ అనుకూల నిర్మాణ విధానాలు అవసరం

'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు

రాయదుర్గం: వాతావరణ అనుకూల నిర్మాణ విధానాలు అవసరమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని 'ఎస్కీ' క్యాంపస్‌లోని క్లైమేట్ చేంజ్ సెంటర్ ఆధ్వర్యంలో 'సస్టేనబుల్ పర్యావరణం, వాతావరణ మార్పులకు అనుకూలంగా బీఎఫ్ఆర్‌పీ/జీఎఫ్ఆర్‌పి రీబార్ కంపోజిట్స్‌తో ఫైబర్ రీఫోర్స్డ్ కాంక్రీట్‌లో అభివృద్ధి' అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఎఫ్ఆర్‌పీ, జీఎఫ్ఆర్‌పీ రీబార్లు వంటి ఆధునిక పదార్థాలు తక్కువ బరువుతో, తక్కువ కార్బన్ ఉద్గారాలతో, తుపానులకు తేమకు, సముద్ర ప్రాంతాలకు తట్టుకొనే సామర్థ్యంతో నిర్మాణాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మాణ రంగ ప్రముఖులు రాజీవ్ బిష్త్, డాక్టర్ చంద్రకళ, నరేష్ మాట్లాడుతూ... పర్యావరణ అనుకూల నిర్మాణ పదార్థాల వినియోగం ద్వారా నిర్మాణమైన అపురూప మన్నిక సాధించడం అవసరమన్నారు.

అంబులెన్స్ ఫైరింజన్ వెళ్లేది ఎలా?

అసలే ఇరుకుదారి.. ఆపై వాహనాల పార్కింగ్

- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం
- నిన్నటి అగ్ని ప్రమాదంతోనైనా కనువిప్పు కలిగేనా?

అధికారుల నిర్లక్ష్యం.. అక్రమ నిర్మాణదారుల స్వార్థం.. ప్రైవేట్ హాస్టల్ నిర్వాహకులు ధనదాహం.. వెరసి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ అత్యంత ప్రమాదకర పరిస్థితులకు నిలయంగా మారింది. మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఓ చిన్న అగ్ని ప్రమాదం పెను విషాదంగా మారకుండా తృటిలో తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకున్నప్పటికీ రోడ్డుకు అడ్డంగా నిలిపిన ద్విచక్ర వాహనాల వల్ల ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకోవడంలో జాప్యం జరిగింది. అదృష్టవశాత్తు అగ్ని ప్రమాదంలో ఓ ద్విచక్ర వాహనం మాత్రమే దగ్ధం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.





కేపీహెచ్‌బీకాలనీలో అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని స్థితిలో అంతర్గత రోడ్లు, వాహనాల పార్కింగ్

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీలోని మూడవ రోడ్డులో ఎల్ఐజీ గృహాల వద్ద మంగళవారం రాత్రి 2 గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. పక్కనే పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనికి మంటలు వ్యాపించాయి. ఫైరింజన్ వచ్చినా ఘటనా స్థలానికి రావడంలో ఆలస్యమైంది. అసలే ఇరుకైన రోడ్లు, వంద గజాల స్థలంలో ఐదేసి అంతస్తుల నిర్మాణాలు చేపట్టి హాస్టల్స్‌కు అద్దెకు ఇచ్చారు. హాస్టల్స్‌లో వందమందికి పైగా వసతి పొందుతూ వారి ద్విచక్ర వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుంటారు. దీంతో ఇరుకైన సందుల్లో, రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన టూ వీలర్ల వల్ల ఫైర్ ఇంజన్ ముందుకు కదలలేకపోయింది. అగ్ని మాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి, కొన్ని వాహనాలను పక్కకు తీసిన తర్వాతే ముందుకు కదలగలిగారు. ఈ జాప్యం కారణంగా మంటలు మరింత వ్యాపించాయి. అదృష్టవశాత్తు ఈ ప్రమాదం కేవలం ఒక టూ వీలర్‌కు మాత్రమే పరిమితం కావడంతో పెద్ద నష్టం జరగలేదు. ప్రమాద తీవ్రత పెరిగి ఏదైనా హాస్టల్ భవనం, నివాస సముదాయానికి మంటలు వ్యాపించి ఉంటే పరిస్థితి చాలా దారుణంగా ఉండేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అత్యంత రద్దీ ప్రదేశంగా హౌసింగ్ బోర్డు

కేపీహెచ్‌బీకాలనీలో ప్రజలతో పాటు వ్యాపారస్తులు కూడా తీవ్ర నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారు. సరిగ్గా ఇరవై అడుగులు కూడా లేని అంతర్గత రోడ్లను ఇష్టారాజ్యంగా ఆక్రమించడం, ఎవరికి వారే అక్రమంగా రోడ్లపై వ్యాపారాలు చేయటం, నిబంధనలకు విరుద్ధంగా ఐదు అంతస్తుల భవనాలు నిర్మించడం, కనీసం పార్కింగ్ సదుపాయం లేకుండా గ్రౌండ్ ఫ్లోర్‌లో కిచెన్లు ఏర్పాటు చేయడం వంటివి ఎక్కడ చూసినా దర్శనం ఇస్తుండటం గమనార్హం. కేవలం ధనార్జనపై దృష్టి పెట్టడం, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం ఇక్కడి విధుల్లో సాధారణ ప్రక్రియగా మారింది.

అక్రమ పార్కింగ్.. పొంచి ఉన్న ప్రమాదం!

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కనీస దూరం పాటించకుండా అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తున్న పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అత్యవసర సేవల వాహనాలకు, ముఖ్యంగా అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్‌లకు దారి ఇవ్వడం ప్రజల కనీస బాధ్యత. అవేమీ పట్టించుకోకుండా నిబంధనలు ఉల్లంఘిస్తూ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలపడం వల్ల తరచుగా ఇలాంటి ప్రమాదకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, చిన్నపాటి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదాన్ని కనువిప్పుగా భావించి సంబంధిత విభాగాల అధికారుల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో ఎగిసి పడుతున్న మంటలు.. దగ్ధమవుతున్న ద్విచక్ర వాహనం

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

ఆట వస్తువులు అందజేత

కూకట్‌పల్లి: నియోజకవర్గంలోని పలు డివిజన్‌లలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు జన్మదినాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా బాగ్ అమీర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల బ్యాగులు, ఇండోర్ క్రీడా సామాగ్రిని అందజేశారు. అదే విధంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సతీష్‌రావు నయశ్రీ ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలోని చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి అల్పాహారం అందజేశారు. అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహా బేగం పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్ హాల్‌లో భారీ కేక్ కట్ చేశారు.

వెయ్యి మందికి చీరల పంపిణీ

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం వెయ్యి మంది మహిళలకు చీరలను పంపిణీ చేశారు. 200 మంది క్యాబ్ డ్రైవర్లకు రూ.15 లక్షలతో ఇన్సూరెన్స్ చేసి వారికి కార్డులను అందించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇర్ఫాన్, మేకల హరినాథ్, కర్రె జంగయ్య, మన్నె ఉదయ్‌యాదవ్, గడ్డం నర్సింగ్‌రావు, మట్టి శ్రీను, బుర్రి యాదగిరి, మక్కాల సత్యనారాయణ, నాగేష్, శ్రీనివాస్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, రాజుగౌడ్, దేవేందర్, వెంకటేశ్, గణేష్, సాదిక్, అరుణ్, ఖాదర్, లలిత, ఉదయరాణి, సరోజదేవి, సంతోషి, అనురాధ, సునంద, శాలిని, దుర్గాదేవి, ఉమా, పద్మ, కమల, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.



చీరలు అందుకున్న మహిళలతో ముద్దం నర్సింహయాదవ్, నాయకులు



పర్వత్‌నగర్ మినీ ఫంక్షన్ హాల్‌లో కేక్ కట్ చేసిన కార్పొరేటర్ సబిహా బేగం తదితరులు



ఆట వస్తువులు అందజేస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు



అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసిన సీనియర్ నాయకుడు సతీష్‌రావు తదితరులు